PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :161 | పేజీలు : 8 | వెల రూ.5 | శనివారం. 27.06.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh




## డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: సీఎం రేవంత్



హైదరాబాద్, జూన్ 26 ప్రభాత సూర్యుడు సమాజాన్ని డ్రగ్స్ నాశనం చేస్తాయి. డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు కీలక సందేశాన్ని ఇచ్చారు. తెలంగాణను డ్రగ్స్ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల మహమ్మారి కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలతో పాటూ మొత్తం సమాజాన్నే నాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా యువత ఎల్లప్పుడూ వీటికి దూరంగా ఉండాలని సీఎం హితవు పలికారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, అందుకోసం వారు స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం చట్టాలు, పోలీసుల చర్యల వల్లే కాకుండా.. ప్రజల్లో సరైన అవగాహన పెంచడం ద్వారానే మాదక ద్రవ్యాల నియంత్రణ పూర్తిగా సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అక్రమ డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని కోరారు. యువత డ్రగ్స్ వైపు వెళ్లకుండా ఉండేందుకు.. వారిలో సానుకూల ఆలోచనలు, నైతిక విలువలను పెంపొందించడం ఎంతో ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాలపై నిరంతరం అప్రమత్తత పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహమ్మారిని రూపుమాపడానికి అందరం కలిసికట్టుగా చేసే సమిష్టి పోరాటమే శాశ్వత పరిష్కారమని, డ్రగ్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రతి పౌరుడూ నడుం బిగించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## తెలంగాణలో 13 మంది ఐఏఎస్ అధికారుల బదిలీలు




హైదరాబాద్, జూన్ 26 ప్రభాత సూర్యుడుతెలంగాణ రాష్ట్ర పాలనా విభాగంలో ప్రభుత్వం పెద్ద ఎత్తున మార్పులు చేర్పులు చేపట్టింది. పరిపాలనను మరింత వేగవంతం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకుంటూ ఒకేసారి 13 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తాజా బదిలీలలో భాగంగా ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ఎన్. శ్రీధర్‌ను నియమించారు. అలాగే ఇప్పటివరకు సీఎంఓలో సేవలందించిన అజిత్‌రెడ్డిని అక్కడి నుంచి బదిలీ చేసి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా కొత్త బాధ్యతలను అప్పగించారు. జీఏడీ ప్రధాన కార్యదర్శిగా అహ్మద్ నదీమ్ నియమితులయ్యారు. ఈ క్రమంలోనే పలువురు సీనియర్ అధికారులకు అదనపు బాధ్యతలను కూడా కేటాయించింది. విపత్తు నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులు కాగా.. ఆయనకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలను అప్పగించారు. అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌ను నియమించగా.. దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. చేనేత, హస్తకళల ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న సవ్యసాచి ఘోష్‌కు ఆ శాఖలోనే మరికొన్ని అదనపు బాధ్యతలను కేటాయించగా.. అదే శాఖకు జాయింట్ సెక్రటరీగా కాత్యాయనీ దేవిని నియమించారు. గనులశాఖ ముఖ్య కార్యదర్శిగా రఘునందన్‌రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే.. హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా కె. చంద్రకళను, తెలంగాణ రెడ్‌కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ముషారఫ్ అలీని నియమించారు. ఆర్‌అండ్‌బీ స్పెషల్ సెక్రటరీగా గంగాధర్‌కు బాధ్యతలు అప్పగించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కమిషనర్‌గా టి.వెంకన్నను నియమించారు. రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధికి అత్యంత కీలకమైన టూరిజం డైరెక్టర్‌గా కె.విద్యాసాగర్‌ను నియమించారు.

## మాదకద్రవ్యాల మాఫియాపై ఉక్కుపాదం..!

**నషా ముక్త్ భారత్‌కు నాంది..! అమిత్ షా కొత్త వ్యూహం!**



ఢిల్లీ, ప్రభాత సూర్యుడు దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. డ్రగ్ మాఫియాపై మరింత కఠినంగా వ్యవహరించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం 'నార్కోటిక్స్ కంట్రోల్ విజన్ డాక్యుమెంట్ 2026-2029'ను విడుదల చేశారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘా ఆధారిత, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన, నెట్‌వర్క్ కేంద్రిత వ్యూహాన్ని అమలు చేయాలని అధికారులకు సూచించారు. న్యూఢిల్లీలో జరిగిన 10వ నార్కో-కోఆర్డినేషన్ సెంటర్ ఉన్నతస్థాయి సమావేశానికి అధ్యక్షత వహించిన అమిత్ షా మాట్లాడుతూ.. వచ్చే మూడేళ్లలో అన్ని సంస్థలు సమన్వయంతో పనిచేస్తే డ్రగ్స్ నిర్మూలనలో గణనీయమైన ఫలితాలు సాధించవచ్చన్నారు. డ్రగ్ స్మగ్లర్లపై ఎలాంటి కనికరం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, మాదకద్రవ్యాలకు బానిసైన యువత పట్ల సానుభూతితో వ్యవహరించి వారిని పునరావాసం వైపు నడిపించాలన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సీబీ వార్షిక నివేదిక-2025ను కూడా విడుదల చేసిన అమిత్ షా.. జమ్మూ, గువాహటిలో కొత్తగా నిర్మించిన ఎన్‌సీబీ జోనల్ కార్యాలయాలను ప్రారంభించారు. అలాగే 'ఆన్‌లైన్ డ్రగ్ డిస్పోజల్ ఫోర్ట్‌నైట్ క్యాంపెయిన్'కు శ్రీకారం చుట్టారు. ఒకే రోజులో రూ.12,525 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను ధ్వంసం చేసినందుకు సంబంధిత సంస్థలను అభినందించారు. కేంద్ర హోంశాఖ, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో సంయుక్తంగా నిర్వహించిన ఈ సమావేశంలో కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, డ్రగ్స్ నియంత్రణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా డ్రగ్స్ అక్రమ రవాణా, మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు సమన్వయంతో పనిచేసే కార్యాచరణపై చర్చించారు.

## తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు నియామకం



హైదరాబాద్, జూన్ 26 ప్రభాత సూర్యుడు తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజును నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెలాఖరుతో ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు పదవీకాలం ముగియనుంది. ఆ వెంటనే సంజయ్ జాజు బాధ్యతలు చేపట్టనున్నారు. కాగా, రాష్ట్ర పరిపాలనపై ఆయనకు సుదీర్ఘ అనుభవం ఉంది. 1992 బ్యాచ్‌కు చెందిన సంజయ్ జాజు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ, కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శిగా పనిచేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఆయనను తెలంగాణ కేడర్‌కు కేటాయించారు. అయితే, 2014 అక్టోబర్ నెలలో డిప్యూటేషన్ పైన కేంద్ర సర్వీసుకు వెళ్లిన సంజయ్ జాజు.. 2018, మార్చి వరకు ఎన్‌హెచ్‌ఐడీసీఎల్ డైరెక్టర్‌గా, ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శిగా పనిచేశారు. 2024 నుంచి కేంద్ర సమాచార, ప్రసార శాఖ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం.. కేంద్ర సర్వీసుల్లో ఉన్న సంజయ్ జాజును తిరిగి మాతృ రాష్ట్ర కేడర్‌కు (తెలంగాణకు) పంపుతూ కీలక నిర్ణయం తీసుకుంది.

## ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందింది వీళ్లే..

**6గురు సైనికుల పేర్లు వెల్లడించిన ప్రభుత్వం**



ఢిల్లీ : ప్రభాత సూర్యుడుభారత్ పాకిస్థాన్ మధ్య జరిగిన ఆపరేషన్ సింధూర్ యుద్ధంలో మరణించిన సైనికుల వివరాలను కేంద్రం వెల్లడించింది. యుద్ధంలో సాయుధ దళాల నుండి మొత్తం ఆరుగురు మరణించినట్టు మొదటిసారి బహిర్గతం చేసింది. వీరమరణం పొందినవారిలో సుబేదార్ మేజర్ పవన్ కుమార్ (ఇండియన్ ఆర్మీ), రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్, వీర చక్ర (ఇండియన్ ఆర్మీ), లాన్స్ నాయక్ దినేష్ కుమార్ (ఇండియన్ ఆర్మీ), ఏవియేషన్ టెక్నీషియన్ మూడ్ మురళీనాయక్ (ఇండియన్ ఎయిర్ ఫోర్స్), హవల్దార్ సునీల్ కుమార్ సింగ్ (ఇండియన్ ఆర్మీ), సార్జెంట్ సురేంద్ర కుమార్, (ఇండియన్ ఎయిర్ ఫోర్స్) ఉన్నారు. దేశ సేవలో ప్రాణాలను అర్పించిన వీరి పేర్లను జాతీయ యుద్ధ స్మారక వెబ్ సైట్‌లోని గౌరవ పట్టికలో చేర్చడంతోపాటు ఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారక చిహ్నంలోని 3డీ వాల్ పై కూడా లిఖించారు. ఆపరేషన్ సింధూర్ జరిగి చాలా కాలం అవుతున్నా ఇప్పటి వరకు మరణించిన వీరుల పేర్లను కేంద్రం వెల్లడించలేదు.

## డ్రగ్స్ బారిన పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దు: భట్టి విక్రమార్క



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు విలువైన జీవితాన్ని డ్రగ్స్ బారిన పడి నాశనం చేసుకోవద్దని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శిల్పకళా వేదికలో నిర్వహించిన ఈగల్ ఫోర్స్ యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ సీవీ ఆనంద్, సినీనటులు రామ్ పోతినేని, మీనాక్షి చౌదరి పాల్గొన్నారు. నిని"తల్లిదండ్రులు తమ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తారు. ఈ ప్రభుత్వం కూడా వారిని కాపాడుకోవాలని ప్రయత్నిస్తోంది. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నారు. తమ జీవితాలను రిస్క్‌లో పెట్టి డ్రగ్స్ ముఠాలను పట్టుకుంటున్నారు. ఈ కేసుల్లో దొరికితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు.

## తెలంగాణ అటవీ శాఖలో కీలక మార్పులు..

**హెచ్‌ఓఎఫ్‌ఎఫ్ డా. సి. సువర్ణ పదవీ విరమణ**




హైదరాబాద్, జూన్ 26 ప్రభాత సూర్యుడు తెలంగాణ అటవీ శాఖలో ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టింది. రాష్ట్ర హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ డా. సి. సువర్ణ ఈనెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో సువర్ణను ప్రభుత్వ సేవల నుంచి రిలీవ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డా.సి.సువర్ణ పదవీ విరమణతో.. ఆ స్థానంలో సీనియర్ ఐఎఫ్‌ఎస్ అధికారి వినయ్ కుమార్‌కు హెచ్‌ఓఎఫ్‌ఎఫ్ పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు వినయ్ కుమార్ ఈ బాధ్యతలను కొనసాగించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం జీఓ ఆర్‌టీ నెం. 915ను విడుదల చేసింది. రాష్ట్ర అటవీ శాఖ పరిపాలనా వ్యవహారాలు నిరంతరాయంగా కొనసాగేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

## రామ జన్మభూమి ట్రస్ట్ అవినీతి వ్యవహారంలో వాస్తవాలు చెప్పాల్సిందే: ఎంపీ చామల



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు: అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ విరాళాల అవకతవకలపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్‌కు సంబంధించి ఎలాంటి అవినీతి జరగలేదని కార్యదర్శి చంపత్ రాయ్ చెప్పారని.. కానీ యూపీ సిట్ పోలీసులు చంపత్ రాయ్ మనుషులను అరెస్టు చేశారన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజల సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని విరాళాలు వసూలు చేశారని అన్నారు. చంపత్ రాయ్‌ను ట్రస్ట్ కార్యదర్శి పదవి నుంచి తప్పించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. యూపీ సీఎం పదవికి యోగీ ఆదిత్య నాథ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇది యూపీకి సంబంధించిన వ్యవహారం కాదని.. దేశ ప్రజలకు సంబంధించిన అంశమన్నారు. అయోధ్య రామ జన్మభూమి ట్రస్ట్ పేరుతో రూ.200 కోట్లు అవినీతి చేశారని ఎంపీ ఆరోపణలు చేశారు. రాముడి పేరు చెప్పి వసూలు చేసిన డబ్బుతో ఏం చేస్తున్నారో బీజేపీ ప్రజలకు చెప్పాలన్నారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ ఎంపీలు 20 మందిని, మహారాష్ట్రలో శివసేన ఉద్ధవ్ థాక్రే ఎంపీలు 6 మందిని.. ఒక్కొక్కరికీ రూ.75 కోట్లు ఇచ్చి బీజేపీ కొనుగోలు చేసిందంటూ వ్యాఖ్యానించారు. రామ జన్మభూమి ట్రస్ట్ అవినీతి వ్యవహారంలో ప్రధాని మోదీ, అమిత్ షా, యోగీ ఆదిత్య నాథ్ ప్రజలకు వాస్తవాలు చెప్పాలన్నారు.

# 28న సీఎం రేవంత్ రెడ్డి సభకు భారీ ఏర్పాట్లు

## సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపు - ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచన



ప్రభాత సూర్యుడు /నల్లగొండ, జూన్ 26 :రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ నెల 28న కనగల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభను చారిత్రాత్మకంగా విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకత్వం పిలుపునిచ్చింది. ఈ మేరకు శుక్రవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్టీ ప్రజాప్రతినిధులు, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సభ విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నల్లగొండ నగర మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కృషితో నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు, సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు.ఈ నెల 28న కనగల్‌లో రూ.13 వేల కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆర్అండ్‌బీ రహదారుల నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారని, అనంతరం ఎన్జీ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటర్ల వివరాల పరిశీలనలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని, బూత్ స్థాయి నాయకులు ప్రతి ఓటరును సంప్రదించి అవసరమైన పత్రాలను పూర్తి చేయించాలని సూచించారు. నల్లగొండ నియోజక వర్గం నుంచి 60 వేల మందికి పైగా సభకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనగల్‌లో రహదారి పనులతో పాటు మెడికల్ కళాశాల నుంచి దుప్పలపల్లి వరకు రూ.250 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రహదారి నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు. అదేవిధంగా రూ.430 కోట్లతో ఎస్ఎల్‌బీసీ కాలువ లైనింగ్ పనులు కొనసాగుతున్నాయని, నియోజకవర్గానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను సీఎం ప్రకటించే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పాశం రామ్ రెడ్డి మాట్లాడుతూ, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్లగొండ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం సభను విజయవంతం చేయడం ద్వారా నియోజకవర్గ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మీ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్లు ఆలకుంట నాగరత్నం రాజు, పాశం సంపత్ రెడ్డి, కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## నల్గొండలో సంచలనం సృష్టించిన ఒకే కుటుంబం నలుగురి హత్య కేసు ఛేదన

**నలుగురు నిందితుల అరెస్ట్.. రూ.30 లక్షల నగదు, బంగారం, కారు స్వాధీనం**

ప్రభాత సూర్యుడు/నల్గొండ, జూన్ 26 :నల్గొండ పట్టణంలోని తెలంగాణ కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దారుణ హత్యకు గురైన కేసును పోలీసులు కేవలం మూడు రోజుల్లో ఛేదించారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ వెల్లడించారు.పోలీసుల దర్యాప్తులో మృతురాలు హసీనా అక్కకూతురు తబస్సుం, ఆమె భర్త సయ్యద్ అస్లాం, అతని స్నేహితుడు మహమ్మద్ సోహైల్, బంగారం తాకట్టు పెట్టడంలో సహకరించిన హేమంత్ కుమార్ నేరంలో పాల్గొన్నట్లు తేలింది.దర్యాప్తు ప్రకారం.. అప్పులు, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ విభేదాలు, డబ్బు మరియు బంగారు ఆభరణాలపై ఆశతో హత్యకు కుట్ర పన్నారు. హసీనా ఇంట్లో భారీగా నగదు, బంగారం ఉందని తెలుసుకున్న అస్లాం, హత్య చేసి ఆధారాలు లేకుండా తప్పించుకునేందుకు యూట్యూబ్‌లో పలు వీడియోలు కూడా చూసినట్లు పోలీసులు వెల్లడించారు.జూన్ 20 తెల్లవారుజామున ఇంట్లోకి చొరబడి హసీనా, ఆమె భర్త సుల్తాన్, కుమారుడు ముజమ్మిల్, కుమార్తె అఫ్రూరాను అత్యంత దారుణంగా హత్య చేసిన అనంతరం బంగారు ఆభరణాలు, నగదు, కీలక పత్రాలు తీసుకుని పరారైనట్లు విచారణలో బయటపడింది.నిందితుల నుంచి మహీంద్రా మరాజో కారు, రూ.30 లక్షల నగదు, ఐదు తులాల కరిగించిన బంగారం, హత్యకు ఉపయోగించిన కత్తి, మూడు సెల్‌ఫోన్లు, రక్తపు మరకలున్న దుస్తులు, భూమి మరియు బ్యాంకు పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ ఫుటేజ్, ఫోరెన్సిక్ ఆధారాలతో వేగంగా ఛేదించిన డీఎస్పీ కె. శివరాం రెడ్డి, సీఐలు, ఎస్సైలు, సీసీఎస్ బృందం మరియు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందిస్తూ రివార్డులు ప్రకటించారు.

## వియత్నాం విద్యార్థులకు కృత్రిమ మేధస్సులో శిక్షణ

**బూట్ క్యాంప్ మెంటర్‌గా గీతం అధ్యాపకుడు డాక్టర్ నిరంజన్ అప్పస్వామి**



ప్రభాత సూర్యుడు/హైదరాబాద్ /విశాఖపట్నం, జూన్ 26 :వియత్నాంలోని హోచి మిన్ సిటీలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) లాంచ్ ప్యాడ్ బూట్ క్యాంప్కు గీతం డీమ్డ్ టు బి యూనివర్సిటీ అధ్యాపకుడు డాక్టర్ నిరంజన్ అప్పస్వామి మెంటర్, రిసోర్స్ పర్సన్‌గా ఆహ్వానం అందుకున్నారు. గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లోని ఏఐ ఉ డేటా సైన్స్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన జూన్ 22 నుంచి జూలై 4 వరకు వియత్నాంలో విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు.హోచి మిన్ సిటీలోని ట్రూంగ్ కావో డాంగ్ వియెన్ డాంగ్ కళాశాలలో జరుగుతున్న ఈ రెండు వారాల శిక్షణా కార్యక్రమం గీతం అధ్యాపకుల నైపుణ్యానికి ప్రపంచస్థాయిలో లభిస్తున్న గుర్తింపుకు నిదర్శనంగా నిలుస్తోంది. డాక్టర్ నిరంజన్ ఈ సంస్థలో బోధన చేయడం ఇది ఆరవసారి కావడం విశేషం. దీంతో గీతం, వియెన్ డాంగ్ విద్యాసంస్థల మధ్య విద్యా సహకారం మరింత బలపడనుంది. 72 గంటల పాటు సాగే ఈ ఏఐ లాంచ్ ప్యాడ్ బూట్ క్యాంప్లో విద్యార్థులకు కృత్రిమ మేధస్సు ప్రాథమిక అంశాల నుంచి ప్రాజెక్ట్ అభివృద్ధి, డిప్లాయిమెంట్ వరకు సమగ్ర శిక్షణ అందిస్తున్నారు. కోడింగ్ లేదా గణితంపై ముందస్తు అవగాహన లేకున్నా, ఓపెన్ సోర్స్ టూల్స్ ఆధారంగా వాస్తవ ప్రపంచ ఏఐ అప్లికేషన్లను రూపొందించేలా కార్యక్రమాన్ని రూపొందించారు.ఈ బూట్ క్యాంప్‌లో ఏఐ ప్రాథమికాలు, పైథాన్, మెషిన్ లెర్నింగ్ ఫండమెంటల్స్, ప్రాక్టికల్ ఏఐ అప్లికేషన్లు, ఏఐ ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్, డిప్లాయిమెంట్ వంటి అంశాలపై నాలుగు దశల్లో శిక్షణ అందిస్తున్నారు. దీంతో విద్యార్థులు వాస్తవ సమస్యలకు ఏఐ ఆధారిత పరిష్కారాలను రూపొందించే అనుభవాన్ని పొందనున్నారు.డాక్టర్ నిరంజన్ అప్పస్వామి ప్రముఖ సైబర్ సెక్యూరిటీ నిపుణుడు, అంతర్జాతీయ విద్యావేత్త. ఇప్పటివరకు 22 పాఠ్యపుస్తకాలను రచించిన ఆయన ప్రస్తుతం ఐఈఈఈ సైబర్ సెక్యూరిటీ స్పెషల్ టెక్నికల్ కమ్యూనిటీ (రాజ) కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. అలాగే సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధస్సు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ వక్తగా గుర్తింపు పొందారు.డాక్టర్ నిరంజన్‌కు లభించిన ఈ అవకాశం గీతం విశ్వవిద్యాలయం విద్యా ప్రతిష్టను ప్రపంచవ్యాప్తంగా మరింత పెంచుతుందని యాజమాన్యం పేర్కొంది. అంతర్జాతీయ విద్యా భాగస్వామ్యాలు, పరిశోధన, ఆవిష్కరణలకు గీతం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తోందని వెల్లడించింది.

# నల్గొండ క్వాడ్రపుల్ మర్డర్ కేసు ఛేదన

**బంధుత్వాన్ని అడ్డంగా పెట్టుకుని దారుణం.. నలుగురు నిందితుల అరెస్ట్**

**మూడు రోజుల్లో కేసును ఛేదించిన నల్గొండ పోలీసులు.**



ప్రభాత సూర్యుడు/నల్గొండ, జూన్ 26: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నల్గొండ క్వాడ్రపుల్ మర్డర్ కేసును జిల్లా పోలీసులు విజయవంతంగా ఛేదించారు. తెలంగాణ కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన సుల్తాన్, హసీనా, ముజమ్మిల్, 12 ఏళ్ల అఫ్రూరాలను హత్య చేసిన కేసులో ప్రధాన నిందితుడు సయ్యద్ అస్లాంతో పాటు అతని భార్య తబస్సుం, స్నేహితుడు మహమ్మద్ సోహైల్, బంగారం తాకట్టు తీసుకున్న హేమంత్ కుమార్లను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ వెల్లడించారు. పోలీసుల దర్యాప్తులో హత్యలకు అప్పులు, ఆర్థిక ఇబ్బందులు, నగదు, బంగారంపై ఆశ ప్రధాన కారణాలుగా తేలింది. హసీనా ఇంట్లో నగదు, బంగారం ఉన్నట్లు తెలిసిన సయ్యద్ అస్లాం, హత్యకు ముందు పోలీసులకు చిక్కకుండా తప్పించుకునే మార్గాలపై, శవాలు ఎన్ని రోజులకు కుళ్లిపోతాయనే అంశాలపై యూట్యూబ్‌లో వీడియోలు వీక్షించినట్లు విచారణలో వెల్లడైంది.జూన్ 19 అర్ధరాత్రి నల్గొండకు చేరుకున్న అస్లాం తెల్లవారుజామున ఇంట్లోకి ప్రవేశించి ముందుగా హసీనాపై కత్తితో దాడి చేశాడు. ఆమె కేకలు విని బయటకు వచ్చిన సుల్తాన్‌ను హత్య చేశాడు. అనంతరం ముజమ్మిల్‌ను హత్య చేసి, సంఘటనను చూసిన 12 ఏళ్ల అఫ్రూరాను కూడా గుర్తిస్తుందనే భయంతో హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు.నలుగురి మరణం నిర్ధారించుకున్న అనంతరం ఇంట్లోని బంగారం, నగదు, భూమి, బ్యాంకు పత్రాలను తీసుకుని, మృతదేహాలపై చద్దర్లు కప్పి ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లిపోయినట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం దోచుకున్న బంగారాన్ని మహమ్మద్ సోహైల్ సహాయంతో హేమంత్ కుమార్ వద్ద తాకట్టు పెట్టి నగదు పొందినట్లు పోలీసులు వెల్లడించారు.సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్, ప్రత్యేక బృందాల సమన్వయంతో కేవలం మూడు రోజుల్లోనే కేసును ఛేదించి నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని వేగంగా ఛేదించిన డీఎస్పీ కె. శివరాం రెడ్డి, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ రాఘవరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, రూరల్ ఎస్సై శివప్రసాద్, టూ టౌన్ ఎస్సై సైదాబాబు, నకిరేకల్ ఎస్సై వీరబాబుతో పాటు సీసీఎస్ బృందం సభ్యులు, నల్గొండ టౌన్ పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు ప్రకటించారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సీఎం చేతుల మీదుగా పంపిణీ చేయాలి: సీపీఎం




ప్రభాత సూర్యుడు /నల్లగొండ, జూన్ 26 : నల్లగొండలో నిర్మాణం పూర్తయిన 552 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను జూన్ 28న జిల్లాకు రానున్న ముఖ్యమంత్రి చేతుల మీదుగా అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హాశం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం దొడ్డి కొమరయ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, 2017లో అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించి, 2023లో లాటరీ పద్ధతిలో 552 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ మౌలిక సదుపాయాల కొరత కారణంగా ఇళ్లను అప్పగించలేదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీపీఎం ఆధ్వర్యంలో పలు దశల్లో ఆందోళనలు నిర్వహించడంతో ప్రభుత్వం జీవో నెం.30 ద్వారా మౌలిక సదుపాయాల కోసం నిధులు విడుదల చేసి పనులను వేగంగా పూర్తి చేస్తోందని తెలిపారు. ప్రస్తుతం అన్ని పనులు పూర్తయినందున జూన్ 28న నల్లగొండకు రానున్న ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు ప్రొసీడింగ్ ఆర్డర్లు అందజేసి వెంటనే ఇళ్లను స్వాధీనం చేయాలని కోరారు. మూడేళ్లుగా లాటరీలో పేరు వచ్చినా ఇప్పటికీ అద్దె ఇళ్లలో నివసిస్తూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో నిర్మాణం పూర్తయిన ఇళ్లను ఖాళీగా ఉంచడంతో ఆకతాయిలు ధ్వంసం చేసి అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మార్చిన ఘటనలను గుర్తు చేస్తూ, మరింత ప్రజాధనం వృథా కాకుండా వెంటనే ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు.ఈ విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండి సలీం, పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, అవుట రవీందర్, దండెంపల్లి సరోజ తదితరులు పాల్గొన్నారు.

## సిటీ బస్సులతో ఆటో కార్మికుల జీవనోపాధికి ముప్పు: ఐఎఫ్‌టీయూ ఆందోళన




ప్రభాత సూర్యుడు/ నల్లగొండ, జూన్ 26: నల్లగొండ పట్టణంలో సిటీ బస్సులు నడపాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రగతిశీల ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుతో ఆటో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో సిటీ బస్సులు ప్రవేశపెడితే వేలాది ఆటో కార్మికుల జీవనోపాధి దెబ్బతింటుందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.నల్లగొండ నగరంలోని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో కత్తుల చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన ఆటో యూనియన్ నగర కమిటీ సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బొంగరాల నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మిడి నగేష్ పాల్గొని మాట్లాడారు. ఆటో కార్మికులు ఇప్పటికే ఇంటి అద్దెలు, పిల్లల విద్య, కుటుంబ పోషణ, వాహన రుణాలు, పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు, స్పేర్ పార్ట్స్ ఖర్చులు, పోలీసు, ఆర్టీఏ చలానాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన నేపథ్యంలో ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం వెంటనే ఆటో వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.నల్లగొండ వంటి చిన్న పట్టణాల్లో సిటీ బస్సులు నడపడం వల్ల ఆటో కార్మికుల ఉపాధి పూర్తిగా దెబ్బతింటుందని పేర్కొన్న నాయకులు, ఈ నిర్ణయాన్ని జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పునరాలోచించాలని కోరారు. సిటీ బస్సుల నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోకపోతే ఆటో కార్మికులతో కలిసి మంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కత్తుల చంద్రశేఖర్, జానపాటి శంకర్, రావుల వీరేష్, ఎస్.కే. జేమన్ ఆలీ, చౌగోని స్వామి, తుపాకి శ్రవణ్, బూరుగు ఈశ్వర్, కొమ్మగోని లక్ష్మణ్, కత్తుల లింగస్వామి, పొట్లపల్లి రామకృష్ణ, పల్ల వెంకట్ రెడ్డి తదితర ఆటో కార్మిక నాయకులు పాల్గొన్నారు.

## నల్లగొండలో సంచలనం రేపిన నాలుగు మృతదేహాల కేసు ఛేదన

**నాలుగు రోజులకే మిస్టరీ వీడింది.. ప్రధాన నిందితుడు అరెస్ట్**




ప్రభాత సూర్యుడు/నల్లగొండ ప్రతినిధి :నల్లగొండ, జూన్ 26 :నల్లగొండ జిల్లాలో సంచలనం సృష్టించిన నాలుగు కుళ్లిన మృతదేహాల కేసును పోలీసులు నాలుగు రోజుల వ్యవధిలోనే ఛేదించారు. ఆధారాలు తక్కువగా ఉండటం, మృతదేహాలు కుళ్లిపోయిన స్థితిలో లభించడం, బంధుత్వాల చిక్కుముడి వంటి సవాళ్ల మధ్య ఈ కేసును జిల్లా పోలీసులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని దర్యాప్తు చేపట్టారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు, డీఎస్పీ శివరాం రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి రాత్రింబవళ్లు శ్రమించాయి. వందల గంటల సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించడం, సాంకేతిక ఆధారాలను విశ్లేషించడం, క్షేత్రస్థాయిలో విస్తృత విచారణ చేపట్టడం ద్వారా కేసును ఛేదించే దిశగా పోలీసులు వేగంగా ముందుకు సాగారు.దర్యాప్తులో లభించిన కీలక ఆధారాల ఆధారంగా ప్రధాన నిందితుడిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. దీంతో నాలుగు రోజులుగా ఉత్కంఠ రేపిన ఈ కేసు మిస్టరీకి తెరపడింది.ఈ కేసు దర్యాప్తులో వన్‌టౌన్ సీఐ ఎం. రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ సీఐ రాఘవరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, రూరల్ ఎస్సై శివప్రసాద్, టూ టౌన్ ఎస్సై సైదా యూ బాబు, నకిరేకల్ ఎస్సై వీరబాబు, సీసీఎస్ బృందానికి చెందిన విష్ణువర్ధనగిరి, నాగార్జున ప్రసాద్, పుష్పగిరి, వైదూ పాషా, సాయి శివరాజ్తో పాటు నల్లగొండ టౌన్ పోలీస్ సిబ్బంది కీలక పాత్ర పోషించారు. కేసును వేగంగా ఛేదించిన పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు. క్లిష్ట పరిస్థితుల్లో సమన్వయంతో పనిచేసి కేసును విజయవంతంగా ఛేదించిన నల్లగొండ జిల్లా పోలీసుల పనితీరుపై ప్రజలతో పాటు పలువురు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.

# ఓటరు జాబితా సవరణపై కాంగ్రెస్ నాయకులకు అవగాహన సమావేశం





కూకట్పల్లి, జూన్ 26 ప్రభాత సూర్యుడుఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు శుక్రవారం కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం శ్రీ హేమదుర్గా భవన్లో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ పార్టీ నాయకులకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణలో పార్టీ నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ఓటరు నమోదు, మార్పులు, చేర్పుల విషయంలో ప్రజలకు పూర్తి సహకారం అందించాలని సూచించారు. ప్రతి అర్హుడైన వ్యక్తి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. నాయకులు తమ తమ డివిజన్లలో ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని, ఎవరూ ఓటు హక్కుకు దూరం కాకుండా చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే నాయకులపై పార్టీ పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి అర్హుడి ఓటు నమోదు అత్యంత కీలకమని పేర్కొంటూ, ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి నాయకుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని బండి రమేష్ సూచించారు. ఈ సమావేశంలో పార్టీ బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా బ్లాక్ అధ్యక్షురాళ్లు, డివిజన్ మహిళా అధ్యక్షురాళ్లు తదితర నాయకులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఓటే కీలకం

**ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా లక్ష్మీదేవిపేట**
**11 వ బూత్ లో ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారమ్స్**
**ఓటర్లకు అందించిన కాంగ్రెస్ పార్టీ**
**బిఎల్ఏ బొమ్మకంటి రమేష్ ఉప సర్పంచ్ కొండ తిరుపతి**

ములుగు జూన్ 26 ప్రభాత సూర్యుడుములుగు ఓటరు జాబితా సవరణ ప్రక్రియ సర్,స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) గురువారం ప్రారంభం కాగా రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి వర్యులు డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క వారి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచన మేరకు వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట గ్రామం 11 వ బూత్ పరిధిలో బీఎల్వో గోస్కుల లక్ష్మణ్ వారితో కలిసి ఓటర్లను కలిశారు. ఎన్యుమరేషన్ పంపిణీ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బొమ్మకంటి రమేష్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ద్వారా కచ్చితమైన సమాచారంతో కూడిన ఓటరు జాబితా రూపొందించాలని భారతదేశం ప్రజాస్వామ్యబద్ధంగా నడుస్తున్నదేశమని, ప్రజాస్వామ్యంలో ప్రజలు వారి ప్రతినిధులను ఓటు హకు ద్వారా ఎన్నుకొంటారని, నేడు జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన ప్రక్రియ అని అన్నారు. ఓటరు విధిగా తన ఓటును 2002 ఓటర్ లిస్ట్ ప్రకారం మ్యాపింగ్ చేసుకోవాలని సూచించారు. డబుల్, డెత్ ఓటర్ లేకుండా అర్హత కలిగిన వారి ఓటు ఉండేలా, కొత్త ఓటరును నమోదు చేసుకోవాలని దీనికి గాను కాంగ్రెస్ పార్టీ నియమించిన బిఎల్ఏ లు ప్రతి బూత్ లో పని చేయాలని కోరారు ఈ కార్యక్రమములో ఉప సర్పంచ్ కొండ తిరుపతి తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు



# అధికార బలం.. అడ్డగోలు కబ్జా! సర్పంచ్ దంపతుల భూ 'దందా'

**సొంత బంధువు ఐదెకరాల భూమిపై 'ఖాకీ, ఖద్దరు' నీడలు!**
**కోర్టులో కేసు నడుస్తుండగానే సర్పంచ్ గారి 'రౌడీయిజం'!**
**కలెక్టర్, ఆర్డీవో గారూ.. సామాన్యుడి ఆవేదన వినబడడం లేదా**



అశ్వారావుపేట, జూన్ 27 ప్రభాత సూర్యుడుఎన్నికల సమయంలో చేతులు జోడించి ఓట్లు అడిగే ప్రజాప్రతినిధులు.. గెలిచిన తర్వాత అదే చేతులతో సామాన్యుల గొంతు నొక్కుతున్నారు. గ్రామానికి ఆదర్శంగా ఉండాల్సిన ఒక సర్పంచ్ దంపతులు, అధికార గర్వంతో కళ్ళు మూసుకుపోయి సొంత బంధువు భూమినే కబ్జా చేసిన అరాచక పర్వం అశ్వారావుపేట రెవెన్యూ పరిధిలో కలకలం రేపుతోంది. ఎలాంటి డాక్యుమెంట్లు లేకపోయినా, కేవలం 'పదవి' అండతో ఐదెకరాల భూమిని ఆక్రమించుకుని, ప్రశ్నిస్తే ప్రాణాలు తీస్తామంటూ బెదిరింపులకు తెగబడుతున్నారు.నారంవారిగూడేనికి చెందిన మనుగొండ సత్యనారాయణ అనే రైతు అశ్వారావుపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 108/34 లో గల 5 ఎకరాల భూమిని గత 2000 సంవత్సరంలో కొదుమూరి కృష్ణమూర్తి వద్ద చట్టబద్ధంగా కొనుగోలు చేశారు. అయితే, ఆ భూమిపై చవ్వా సత్యనారాయణ అనే వ్యక్తి ఫ్రీడమ్ ఫైటర్ పట్టా పేరుతో వివాదం లేపడంతో, బాధితుడు న్యాయం కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ భూమి పంచాయితీ ప్రస్తుతం కోర్టు పరిధిలోనే ఉంది.సర్పంచ్ దంపతుల ఎంట్రీ.. ఎందుకీ రౌడీయిజం టిగేషన్ కోర్టులో నడుస్తుండగా.. సదరు భూమితో ఎలాంటి సంబంధం లేని సర్పంచ్ దంపతులు అక్రమంగా రంగంలోకి దిగారు. బాధితుడు మనుగొండ సత్యనారాయణ వీరికి స్వయానా బంధువు అయినప్పటికీ.. కనీస మానవత్వం లేకుండా గత ఏడాది కాలంగా ఆ భూమిలోకి అడుగుపెట్టకుండా రౌడీయిజం ప్రదర్శిస్తున్నారు."ఈ భూమి మాదే.. ఇంకొకసారి ఇటు వస్తే తన్ని తరిమేస్తాం, చంపేస్తాం" అంటూ తీవ్రస్థాయిలో బెదిరింపులకు పాల్పడుతూ, బాధితుడిని భయభ్రాంతులకు గురిచేసి పొలం నుండి వెళ్లగొట్టారు.బాధితుడి కన్నీటి గోడు..

"కష్టపడి కొనుక్కున్న భూమిని ప్రజాప్రతినిధి హోదాలో ఉండి కబ్జా చేశారు. ఒకవైపు కోర్టు చుట్టూ తిరగలేక, మరోవైపు నా భూమిని కాపాడుకోలేక నరకయాతన అనుభవిస్తున్నాను. సర్పంచ్ అనే పెద్ద పదవిలో ఉండి ఇలాంటి అక్రమాలకు పాల్పడటం ఎంతవరకు సబబు? బంధువులని కూడా చూడకుండా నన్ను రోడ్డున పడేశారు" అని బాధితుడు మనుగొండ సత్యనారాయణ విలేకరుల ఎదుట కన్నీరుమున్నీరయ్యారు.అధికారులు నిద్ర వీడేది ఎప్పుడు?.. బాధితుడికి న్యాయం జరిగేదెన్నడుఈ భూ కబ్జాపై విసిగిపోయిన బాధితుడు న్యాయం కోసం స్థానిక రెవెన్యూ, పోలీస్ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్, ఆర్డీవో (=ఖూ) లకు కూడా లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేశారు. కానీ ఇంతవరకు అధికారుల నుంచి ఎలాంటి కదలిక లేకపోవడంపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.శాంతిభద్రతలను కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే ఇలా భూకబ్జాలకు పాల్పడుతుంటే, సామాన్యులు ప్రాణభయంతో అధికారుల చుట్టూ తిరగాల్సి రావడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, బాధితుడు మనుగొండ సత్యనారాయణకు న్యాయం చేయాలని, అక్రమ కబ్జాకు పాల్పడిన సర్పంచ్ దంపతులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# గిరిజన గురుకుల పాఠశాలలో ఘనంగా సయ్యద్ నౌషాద్ అలీ జన్మదిన వేడుకలు.

**మొక్కలు నాటిన 'హ్యాపీ సేవా సంస్థ'.**

నెల్లూరు జిల్లా,కావలి,ప్రభాత సూర్యుడుస్థానిక ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో శుక్రవారం హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షులు సయ్యద్ ఘని బాష కుమారుడు, ఇంజనీరింగ్ విద్యార్థి సయ్యద్ నౌషాద్ అలీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామ్ సుధాకర్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల హర్షధ్వానాల మధ్య నౌషాద్ అలీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అక్కడికి విచ్చేసిన పెద్దలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు, శుభాశీస్సులు అందజేశారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణను కాంక్షిస్తూ మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న స్వచ్ఛంద సంస్థల అధ్యక్షులు ఎస్.కె. బాష, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎం. అజిత్ బాబు ప్రసంగిస్తూ... నౌషాద్ అలీ పుట్టినరోజు వేడుకలను గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థుల మధ్య జరుపుకోవడం చాలా సంతోషకరమని కొనియాడారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ విరివిగా చెట్లను నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు.హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షులు ఘని బాష ఎందరో దాతల సహకారంతో నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారని కొనియాడారు. తన పిల్లలను ఎంతో ఇష్టపడి, కష్టపడి చదివిస్తూ విద్యకు ఆయన ఇస్తున్న ప్రాధాన్యత అభినందనీయమన్నారు. "విద్యతోనే వివేకం, వివేకంతోనే సౌభాగ్యం సిద్ధిస్తాయి. ఎక్కడైతే విద్య విరాజిల్లుతుందో అక్కడ అభివృద్ధి తాండవిస్తుంది. ఒక్క చదువుతోనే ఎంతటి పేదరికానైనా నిర్మూలించవచ్చు" అని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సామాజిక సేవకులు, జాగో సేవా సంస్థ ప్రతినిధి షేక్ జమీర్, ప్రభాకర్, నాగరాజు, విజయ్ దేవరకొండ, చాన్ బాష, హాజరత్తయ్య, హాఫీజ్ అలీ, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్‌లో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే.

నందిగామ, ప్రభాత సూర్యుడు:.ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య.నందిగామ పట్టణంలోని కాకాని నగర్‌లో ఉన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలను స్వయంగా కలుసుకుని వారి సమస్యలు, వినతులను ఎమ్మెల్యే శ్రద్ధగా విన్నారు.ఈ సందర్భంగా తాగునీరు, విద్యుత్, రెవెన్యూ తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సంబంధిత శాఖల అధికారులతో వెంటనే మాట్లాడి సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడమే ప్రజా దర్బార్ ప్రధాన ఉద్దేశమని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, పారదర్శక పాలనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి సమస్యకు వేగంగా స్పందించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని అధికారులను హెచ్చరించిన ఎమ్మెల్యే, ప్రజలకు జవాబుదారీతనంతో సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# పొల్యూషన్ సర్టిఫికెట్‌పై వాహనదారులకు ఊరట!.



ప్రభాత సూర్యుడు.బీఎస్-6 (BS-VI) ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న కొత్త వాహనాల యజమానులకు కేంద్ర ప్రభుత్వం త్వరలోనే శుభవార్త అందించే అవకాశం ఉంది. పొల్యూషన్ అండర్ కంట్రోల్ (ఖజ)సర్టిఫికెట్ చెల్లుబాటు కాలాన్ని గణనీయంగా పెంచే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం బీఎస్-6 వాహనాలకు నిర్దిష్ట వ్యవధిలో కాలుష్య పరీక్షలు నిర్వహించి పీయూసీ సర్టిఫికెట్‌ను పునరుద్ధరించాల్సి ఉండగా, కొత్త ప్రతిపాదన అమల్లోకి వస్తే ఆరు సంవత్సరాల లోపు ప్రైవేట్ బీఎస్-6 వాహనాలకు ఒకేసారి మూడేళ్ల వరకు చెల్లుబాటు కల్పించే అవకాశం ఉంది.

# యువత డ్రగ్స్ జోలికి పోవద్దు సీఐ ముత్యం రమేష్

**గంజాయి సంబంధించిన సమాచారం ఇస్తే 5000/- నగదు బహుమతి**






ములుగు జూన్ 26, ప్రభాత సూర్యుడు)ప్రపంచ మాదకద్రవ్యాల దినోత్సవం సందర్భంగా మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం శుక్రవారం వెంకటాపురం మండలం ఆలుబాక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం సీఐ ముత్యం రమేష్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిఐ మాట్లాడుతూ యువత డ్రగ్స్ కి దూరంగా ఉండాలనిచెడు వ్యసనాలకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఉన్నత విద్య, కెరీర్‌పై దృష్టి పెట్టాలనిమత్తు పదార్థాలకు అలవాటు పడితే ఆరోగ్యం పాడవ్వడంతో పాటు కుటుంబాలు రోడ్డున పడతాయని సీఐ స్పష్టం చేస్తున్నారు.డ్రగ్స్ కి బానిస అవడం వల్ల కలిగే అనర్థాలు గురించి వివరించి డ్రగ్స్ అమ్మినా, కొన్న, సేవించినా , రవాణా చేసిన నేరం గానే పరిగణించ బడుతుందని చూసించారు.డ్రగ్స్ అందులో ముఖ్యంగా గంజాయి సంబంధించిన సమాచారం ఇస్తే 5000/- లు నగదు బహుమతి ఇస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సైలు తిరుపతి రావు, తిరుపతి రెడ్డి, అలుబాక సర్పంచ్ ఆదిలక్ష్మి , బోదపురం సర్పంచ్ కోర్స నరసింహ రావు యువత పాల్గొన్నారు.

# వెంకటరావుపేటలో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన గొడిశాల రామనాథం



పినపాక, జూన్ 26 ప్రభాత సూర్యుడుపినపాక మండలం వెంకటరావుపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న, గృహప్రవేశానికి ప్రారంభంలో ఉన్న పలు ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గొడిశాల రామనాథం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణం నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత వారికి సూచించారు.అనంతరం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# (సర్) కోసం కాంగ్రెస్ ఇంచార్జిల లా నియమకం



ప్రభాత సూర్యుడు స్పెషల్ ఇంటెన్సిన్ రివిజన్ (సర్) కార్యక్రమం కోసం నియోజకవర్గాలవారీగా ప్రత్యేక ఇన్చార్జిలను నియమిస్తూ టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు సంగారెడ్డి సిహెచ్.దయాకర్, పటాన్ చెరువు జి.శ్రీనివాస్, జహీరాబాద్ ఎండి గౌస్, నారాయణఖేడ్ ఎంఏ షహీ మ్,అందోలు డాక్టర్. ఎం. రాజీవన్ ను ఇన్చార్జులుగా నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.




# ఓజి2.. బిగ్గెస్ట్ వెపన్ అదేనా?

పాన్ ఇండియా సినిమాల ట్రెండ్ ప్రారంభమైన తర్వాత ఆడియన్స్ యాక్షన్ సీన్స్ ను చూసే విధానం పూర్తిగా మారిపోయింది. పాన్ ఇండియా సినిమాల




ట్రెండ్ ప్రారంభమైన తర్వాత ఆడియన్స్ యాక్షన్ సీన్స్ ను చూసే విధానం పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు భారీ సెట్లు, విజువల్స్, ఫైట్లు మాత్రమే యాక్షన్ సినిమాలకు మెయిన్ ఎట్రాక్షన్ గా భావించేవారు. ఇప్పుడు వాటితో పాటూ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా సినిమా ప్రభావాన్ని నిర్ణయించే కీలక అంశంగా మారింది. థియేటర్‌లో ఒక సీన్ ఎంత స్ట్రాంగ్ గా కనెక్ట్ అవుతుందో, ఆడియన్స్ కు ఎంతకాలం గుర్తుండిపోతుందో అనేది చాలా వరకు మ్యూజిక్ డైరెక్టర్ అందించే స్కోర్‌పైనే ఆధారపడుతోంది. ఇటీవలి కాలంలో రిలీజైన పలు పాన్ ఇండియా సినిమాలు ఈ విషయాన్ని స్పష్టంగా నిరూపించాయి. హీరో ఎంట్రీ, ఛేజ్ సీక్వెన్స్, ఎమోషనల్ క్లైమాక్స్ లేదా విలన్ ప్రెజెన్స్ వంటి ప్రతి కీలక ఘట్టాన్ని మరింత ఎలివేట్ చేయడంలో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రధాన పాత్రను పోషించింది. అందుకే ఇప్పుడు డైరెక్టర్లు కథ, యాక్షన్ డిజైన్‌తో పాటు సంగీత రూపకల్పనపైనా ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్ నటిస్తున్న ఓజి సినిమా ప్రీక్వెల్ కూడా అదే దారిలో ముందుకెళ్తోందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఓజి2 అనౌన్స్‌మెంట్ వీడియోకు తమన్ ఇచ్చిన బీజీఎం అందరినీ తెగ ఆకట్టుకుంటుంది. ఆ బీజీఎం పూర్తి ట్రాక్ కాకపోయినా, అందులో వినిపించిన డార్క్ టోన్, హెవీ పర్కషన్, ఆర్కెస్ట్రల్ లేయర్స్, ఇంటెన్స్ సౌండ్ డిజైన్ అభిమానుల అంచనాలను మరింత పెంచాయి. యాక్షన్ ప్రపంచానికి తగ్గట్టుగా ప్రత్యేకమైన మ్యూజికల్ ఐడెంటిటీని రూపొందించే ప్రయత్నం జరుగుతోందనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

## ఎవరీ నాగదుర్గ?
## ఫోక్ సాంగ్స్ టూ హీరోయిన్ గా.. బ్యాక్ గ్రౌండ్ ఏంటంటే?



యూట్యూబ్‌లో ఒక్క ఫోక్ సాంగ్ వస్తే చాలు.. మిలియన్ల కొద్దీ వ్యూస్‌తో ఊగిపోయే తెలంగాణ జానపద గీతాల గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. యూట్యూబ్‌లో ఒక్క ఫోక్ సాంగ్ వస్తే చాలు.. మిలియన్ల కొద్దీ వ్యూస్‌తో ఊగిపోయే తెలంగాణ జానపద గీతాల గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అలాంటి పాటల్లో తన డ్యాన్స్‌తో కుర్రకారును స్టెప్పులేయించిన బ్యూటీనే గుత్తా నాగదుర్గ. 'తిన్నా తిరం పడతలే' అంటూ అందరి దృష్టిని ఆకర్షించిన ఈ నల్గొండ పల్లెటూరి అమ్మాయి, ఇప్పుడు వెండితెరపై కథానాయికగా మెరవబోతోంది. ఫోక్ సాంగ్స్ నుంచి సినిమాల వరకు సాగిన ఆమె సక్సెస్ జర్నీ విశేషాలు తెలుసుకుందాం.. నల్గొండ టూ కూచిపూడి మాస్టర్స్: నాగదుర్గ తెలంగాణలోని నల్గొండ జిల్లాలో జన్మించారు. చిన్నప్పటి నుంచే నృత్యంపై ఉన్న మక్కువతో ఆమె క్లాసికల్ డ్యాన్స్ నేర్చుకున్నారు. ఇక కేవలం సరదాగా కాకుండా, కూచిపూడి నృత్యంలో ఏకంగా మాస్టర్స్ డిగ్రీ కూడా పూర్తి చేసి ప్రొఫెషనల్ డ్యాన్సర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. ఇక ఆ తర్వాత తన టాలెంట్‌ను ప్రపంచానికి చూపించడానికి యూట్యూబ్ వేదికను ఎంచుకున్నారు. యూట్యూబ్‌ను షేక్ చేసిన జానపదాలు:క్లాసికల్ డ్యాన్సే కాకుండా తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే ఫోక్ సాంగ్స్‌లో నాగదుర్గ చేసిన డ్యాన్స్ పెర్ఫార్మెన్స్ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంది. ముఖ్యంగా 'తిన్నా తిరం పడతలే', దారిపొంటత్తుండు, పేరుగల్ల పెద్ది రెడ్డి, అలాగే కప్పోళ్ల ఇంటికాడ వంటి సూపర్ హిట్ సాంగ్స్ ఆమెకు విపరీతమైన పాపులారిటీని తెచ్చిపెట్టాయి. ఈ పాటలతో ఆమె ప్రతి ఇంట్లో సుపరిచితమైన ఫేస్ అయిపోయారు. 'చీచీ నృత్యాలయం' అకాడమీ స్థాపన: కళపై ఉన్న గౌరవంతో నాగదుర్గ కేవలం తను మాత్రమే డ్యాన్స్ చేయకుండా, ఇతరులకు కూడా నేర్పించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే ఆమె 'చీచీ నృత్యాలయం' అనే డ్యాన్స్ అకాడమీని స్థాపించారు. ఈ అకాడమీ ద్వారా ఎంతో మంది చిన్నపిల్లలకు, ఆసక్తి గల వారికి డ్యాన్స్‌లో శిక్షణ ఇస్తూ గురువుగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తెలుగు, తమిళ సినిమాల్లో హీరోయిన్‌గా: యూట్యూబ్ స్టార్‌గా మారిన నాగదుర్గ ప్రతిభను గుర్తించిన సినీ పరిశ్రమ ఆమెకు హీరోయిన్ ఆఫర్లను తెచ్చిపెట్టింది. టాలెంటెడ్ యాక్టర్ ప్రియదర్శి హీరోగా, సుకుమార్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వస్తున్న 'ఇడుపు కాయితం' అనే చిత్రంతో ఆమె టాలీవుడ్‌లో హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. కేవలం తెలుగులోనే కాకుండా, తమిళంలో ఆమె నటించిన 'లవ్ ఓ లవ్' అనే సినిమా కూడా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఒక సాధారణ పల్లెటూరి బ్యాక్‌గ్రౌండ్ నుంచి వచ్చి, చదువుకుంటూనే డ్యాన్స్‌పై నమ్మకంతో యూట్యూబ్ ద్వారా గుర్తింపు తెచ్చుకున్న నాగదుర్గ ప్రయాణం నిజంగా స్ఫూర్తిదాయకం. ఫోక్ సాంగ్స్‌తో అలరించిన ఈ కూచిపూడి కళాకారిణి, ఇప్పుడు వెండితెరపై హీరోయిన్‌గా కూడా మంచి విజయాలు అందుకోవాలని, తన నటనతో ప్రేక్షకులను మరింతగా మెప్పించాలని ఆశిద్దాం.

# డబ్బు వేటలో ఆరోగ్యాన్ని బంధాల్ని కోల్పోతున్నాం: పూరి మ్యూజింగ్స్



పూరి జగన్నాథ్ కెరీర్ జర్నీని గమనిస్తే...ఆయన కాలం విలువను కేవలం మాటల్లో చెప్పడమే కాదు... చేతల్లో చూపిస్తూ -ఇన్ టైమ్-లోనే ఆశించిన భారీ విజయాలను సాధించారు. డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ వైవిధ్యమైన ఆలోచనలకు, సరికొత్త ఫిలాసఫీకి వేదికగా నిలుస్తుంది -పూరి మ్యూజింగ్స్- పాడ్ కాస్ట్. తాజా పాడ్ కాస్ట్ లో పూరి టైమ్ తాలూకా విలువను, ప్రాముఖ్యతను తనదైన శైలిలో వివరించారు. ఈ ప్రపంచంలో డబ్బు కంటే కూడా అత్యంత విలువైనది సమయమని.. పోగొట్టుకున్న డబ్బును మళ్ళీ కష్టపడి సంపాదించవచ్చు కానీ.. చేజారిన కాలాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరిగి తీసుకురాలేమని విశ్లేషించారు. మనుషులు డబ్బు సంపాదించే వేటలో పగలు, రాత్రి కష్టపడుతూ ఆరోగ్యాన్ని, బంధాలను దూరం చేసుకుంటున్నారని.. తీరా బోలెడంత డబ్బు సంపాదించాక దానిని అనుభవించడానికి జీవితంలో టైమ్ మిగలడం లేదని పూరి ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే సమయమే నిజమైన కరెన్సీ అని... ఎంత డబ్బు ఇచ్చినా కాలాన్ని కొనలేమని పూరీ నొక్కి చెప్పారు. పూరి జగన్నాథ్ కెరీర్ జర్నీని గమనిస్తే...ఆయన కాలం విలువను కేవలం మాటల్లో చెప్పడమే కాదు... చేతల్లో చూపిస్తూ -ఇన్ టైమ్-లోనే ఆశించిన భారీ విజయాలను సాధించారు. పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా వచ్చిన -బద్రి- సినిమాతో దర్శకుడిగా ప్రస్థానాన్ని ప్రారంభించిన పూరి.. అతి తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో స్టార్ డైరెక్టర్ హోదాను సొంతం చేసుకున్నారు. వరుసగా ఇండస్ట్రీ హిట్లను అందిస్తూ వందల కోట్ల ఆస్తులను ఆర్జించారు. సినిమా ఇండస్ట్రీలో ఒక స్క్రిప్ట్ రాయడానికి లేదా సినిమా పూర్తి చేయడానికి ఏళ్లకెళ్లు సమయం తీసుకునే రోజుల్లో పూరి మాత్రం కేవలం కొన్ని నెలల వ్యవధిలోనే పక్కా ప్లానింగ్‌తో సినిమాలను పూర్తి చేస్తూ టైమింగ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. ఆయన ప్రతి 10 ఏళ్ల కెరీర్ జర్నీని పరిశీలిస్తే... ప్రతి దశాబ్దంలోనూ పూరి జగన్నాథ్ అనుకున్నది సాధిస్తూ ఎవరికీ అందనంత ఎత్తుకు ఎదిగారు. మొదటి దశాబ్దంలో -ఇట్లు శ్రావణి సుబ్రమణ్యం-, -ఇడియట్-, -అమ్మా నాన్నా ఓ తమిళ అమ్మాయి-,-పోకిరి- వంటి ట్రెండ్ సెట్టర్ సినిమాలతో తెలుగు సినిమా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాశారు. ఆ తర్వాతి దశాబ్దాల్లోనూ ఒడిదొడుకులు ఎదురైనా బిజినెస్ మ్యాన్, టెంపర్, ఇస్మార్ట్ శంకర్ వంటి చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద తన సత్తా ఏంటో నిరూపించుకుంటూనే వచ్చారు. కచ్చితంగా పూరి తన జీవితంలో, కెరీర్‌లో -ఇన్ టైమ్- లోనే అనుకున్న లక్ష్యాలను, రికార్డులను సమర్థవంతంగా చేరుకున్నారని చెప్పవచ్చు. ప్రస్తుతం ఫిలింనగర్, కృష్ణానగర్‌లలో అవకాశాల కోసం ఎదురుచూస్తూ భవిష్యత్తును నిర్మించుకోవాలనుకునే నేటితరం ఔత్సాహిక ఫిలింమేకర్స్ పూరి జగన్నాథ్ చెప్పిన టైమింగ్ నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. చాలామంది యువ దర్శకులు ఒకే స్క్రిప్ట్ పట్టుకుని ఏళ్ల తరబడి సమయాన్ని వృథా చేస్తుంటారు. కానీ పూరి జగన్నాథ్ లాగా వేగంగా ఆలోచించడం, శరవేగంగా స్క్రిప్ట్ పూర్తి చేయడం.. అనుకున్న సమయానికి సినిమాను తెరకెక్కించడం వంటి -టైమ్ మేనేజ్‌మెంట్- సూత్రాలను అలవర్చుకోవాలి. కాలం ఎవరి కోసమూ ఆగదని... వచ్చిన అవకాశాన్ని ఇన్ టైమ్‌లో ఉపయోగించుకుంటేనే ఇండస్ట్రీలో స్థిరపడగలమని పూరి జర్నీ నిరూపిస్తోంది.

## చరణ్ కి నెక్ట్స్ సినిమా నుంచి కొత్త ట్యాగ్!?

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటించిన పెద్ది సినిమా తన కెరీర్ లో మరో బిగ్ హిట్ ని తన ఖాతాలో వేసుకున్నారు. అయితే ఈ సినిమాతోనే రామ్ చరణ్ విషయంలో ఇంట్రెస్టింగ్ మార్పులు జరిగాయి. గత సినిమా గేమ్ ఛేంజర్ తో వచ్చిన గ్లోబల్ స్టార్ ట్యాగ్ ని మొదట కొనసాగించారు



కానీ మళ్లీ మెగాపవర్ స్టార్ ట్యాగ్ కి వచ్చేసారు. కానీ ఇప్పుడు సరికొత్తగా న్యూ ఏజ్ మెగాస్టార్ అంటూ కొత్తది వచ్చింది.రీసెంట్ గా ఈ ట్యాగ్ విషయం లో మెగాస్టార్ చిరంజీవి కూడా ఆనందం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే తాజాగా సోషల్ మీడియాలో కూడా రామ్ చరణ్ కి మెగాపవర్ స్టార్ బదులు న్యూ ఏజ్ మెగాస్టార్ ట్యాగ్ ని వైరల్ చేస్తున్నారు. సో రామ్ చరణ్ కి ఇక నుంచి టాలీవుడ్ లో ఇదే కొత్త ట్యాగ్ కొనసాగుతుందా అని అనుకోవాలి. అలానే నెక్ట్స్ చేయనున్న సుకుమార్ ప్రాజెక్ట్ కి కూడా ఇదే ట్యాగ్ పడితే ఫ్యాన్స్ కిక్ కూడా స్పెషల్ గా ఉ ంటుంది. సో ఫ్యూచర్ ఎలా ఉంటుందో చూడాలి.

## ఈ ఏడాది నందమూరి వారసుడి ఎంట్రీ ఉంటుందా లేదా..?

నందమూరి బాలకృష్ణ వారసుడు మోక్షజ్ఞ సినీ అరంగేట్రంపై సస్పెన్స్ కొనసాగుతోంది. గతంలో ప్రశాంత్ వర్మతో అనుకున్న ప్రాజెక్ట్ ముహూర్తానికి ముందే ఆగిపోగా, గత ఎనిమిది నెలలుగా ఆయన డెబ్యూపై ఎలాంటి కొత్త వార్తలు లేవు. బాలయ్య తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'ఆదిత్య 999'లో మోక్షజ్ఞకు కీలక పాత్ర ఉ



ంటుందని చెప్పినప్పటికీ.. ప్రస్తుతం ఆయన వరుస సినిమాలతో బిజీగా ఉండటంతో ఆ ప్రాజెక్ట్ కూడా పట్టాలెక్కేలా కనిపించడం లేదు. మోక్షజ్ఞను లాంచ్ చేయడానికి పలువురు బడా నిర్మాతలు సిద్ధంగా ఉన్నా, ఆయన మాత్రం ఇప్పటివరకు ఏ సినిమా సైన్ చేయలేదు. ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే ఈ ఏడాది ఆయన ఎంట్రీపై ఎలాంటి బిగ్ అప్‌డేట్ వచ్చేలా లేదు.

# బాహుబలి 3 వచ్చేస్తోంది.. క్లారిటీ ఇచ్చిన ప్రభాస్!

రెబల్ స్టార్ ప్రభాస్ బాహుబలి పాత్రలో.. ఆయనకు దీటుగా అంతే స్టామినా ఉన్న దగ్గుబాటి రానా భల్లాల దేవుడి పాత్రలో నటించి తమ పాత్రలకు న్యాయం చేశారు. బాహుబలి.. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం తెలుగు సినిమా ఖ్యాతిని ఒక్కసారిగా ఎల్లలు దాటించి అందరి దృష్టిని తెలుగు సినిమాపై పడేలా చేసింది. ముఖ్యంగా ప్రపంచ స్థాయిలో తెలుగు సినిమాలకు ఒక హోదాను కల్పించింది అనడంలో సందేహం లేదు. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలోని ప్రతి సన్నివేశాన్ని రాజమౌళి దగ్గరుండి మరీ చెక్కాడు. రెబల్ స్టార్ ప్రభాస్ బాహుబలి పాత్రలో.. ఆయనకు దీటుగా అంతే స్టామినా ఉన్న దగ్గుబాటి రానా భల్లాల దేవుడి పాత్రలో నటించి తమ పాత్రలకు న్యాయం చేశారు. ముఖ్యంగా ఈ సినిమాలో చెప్పుకోదగ్గ పేరు శివగామి.. రమ్యకృష్ణ తప్ప ఆ పాత్రకు మరొకరు న్యాయం చేయలేరు అనే రేంజ్ లో ఆమె ఆ పాత్రకు ఊపిరి పోసింది. నాజర్, సత్యరాజ్, అనుష్క, తమన్నా ఇలా ఎవరికి వారు తమ పాత్రలకు పూర్తిస్థాయిలో న్యాయం చేసి, సినిమాను ఒక స్థానంలో కూర్చోబెట్టారు. అలా ప్రతి ఒక్కరి కష్టం ఈ సినిమా ద్వారా కనిపించింది. పైగా ఈ సినిమా క్లైమాక్స్ లో కట్టప్ప బాహుబలిని ఎందుకు చంపాడు? అనే ప్రశ్నతో బాహుబలి సినిమాను ముగించేసి.. ఆ క్యూరియాసిటీని మరింత పెంచుతూ బాహుబలి 2 పై అంచనాలు పెంచేశారు రాజమౌళి. ఈ సినిమా కూడా విడుదలయ్యి బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్లను వసూలు చేసింది. అంతేకాదు బాహుబలి తీసుకొచ్చిన క్రేజ్ బాహుబలి 2కి బాగా వర్కౌట్ అయిందని చెప్పాలి. ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో అత్యధిక కలెక్షన్స్ వసూలు చేసిన రెండవ చిత్రంగా నిలిచి రికార్డులు సృష్టించింది . ప్రపంచవ్యాప్తంగా కూడా భారీ రికార్డులు క్రియేట్ చేసింది ఈ సినిమా. ఇక ఈ సినిమాకి కొనసాగింపుగా బాహుబలి 3 ఉంటే బాగుండు అనే కామెంట్లు కూడా



వ్యక్తమయ్యాయి. అయితే బాహుబలి లవర్స్ కోసం ఇప్పటికే బాహుబలి ఎటర్నల్ వార్ అని ఒక యానిమేషన్ సిరీస్ ని ప్రకటించి టీజర్ రిలీజ్ చేశారు. అలాగే బాహుబలి ఎపిక్ అని రెండు పార్ట్స్ ని కలిపి ఒకే సినిమాగా రిలీజ్ చేశారు. వీటికి తోడు తాజాగా ప్రముఖ ఓటీటీ ప్లాట్ఫామ్ నెట్ ఫ్లిక్స్ వేదికగా బాహుబలి ది టార్చ్ బేరర్ అనే డాక్యుమెంటరీ సిరీస్ తో మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ముఖ్యంగా ఈ సిరీస్ ని నాలుగు ఎపిసోడ్స్ గా రిలీజ్ చేశారు. ఇందులో ఈ సినిమా కోసం పనిచేసిన ప్రభాస్ , రాజమౌళి, అనుష్క, రానా, రమ్యకృష్ణ, సెంథిల్ కుమార్ తో పాటు పలువురు సాంకేతిక నిపుణులు సినిమా గురించి, వారి అనుభవాలను పంచుకున్నారు. పైగా బాహుబలి మేకింగ్ ని కూడా చూపించారు. దీంతో ఈ సిరీస్ కాస్త వైరల్ గా మారింది. ఈ సిరీస్ లో రానా, ప్రభాస్, అనుష్క ఒకచోట చేరి మాట్లాడుతూ ఈ విషయంపై క్లారిటీ ఇచ్చారు.

Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555